E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 04-03-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:61|| పేజీలు–6 www.ekaburu.com

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు



మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు

**ఈ కబురు, హైదరాబాద్ :**

**ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది**

....(మిగతా2లో)



2

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**ఈ కబురు, బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లెగూడెంలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. 10 నెలల శిశువు, రెండేళ్ల కుమారుడిని తల్లి ఐశ్వర్య చంపేసింది.**



2

## తెలంగాణలో గరిష్ఠ స్థాయికి విద్యుత్ వినియోగం

**ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. రాష్ట్ర చరిత్రలోనే మంగళవారం అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇవాళ 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు అధికారులు వెల్లడించారు.**

## ఒమన్, కువైట్, ఖతార్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్



ఈ కబురు : ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు భారత్‌కు చెందిన ముగ్గురు మృతి చెందారు.

....(మిగతా2 లో)

## ఇరాన్-ఇజ్రాయెల్ భీకరయుద్ధం

ప్రపంచాన్ని ఆందోళన కు గురి చేస్తున్న యుద్ధం



- యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్ పై ప్రభావం
- ప్రధాని మోదీ ఆందోళన
- పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి తీవ్ర ఆందోళన
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- ఇండియాలో పలు వస్తువుల ధరాఘాతం
- చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవడానికి భారత్ మద్దతు

**ఈ కబురు ;**

**ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ఇప్పుడు ప్రపంచాన్ని ఆందోళనకు గురి చేస్తుంది. ఈ ప్రస్తుత యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, రాజకీయ, ఆర్థిక రంగాలపై తీవ్రప్రభావం చూపే అవకాశముంది. ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్‌పైనా గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో మన ఆర్థిక నిపుణులు పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా గమనిస్తూ, ముఖ్యంగా చమురు ధరలు మరియు ట్యాంకర్ల రవాణాపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నారు.**

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక ప్రభావాన్ని ఖచ్చితంగా అంచనా వేయడం కష్టమని అధికారులు చెబుతున్నారు.మరోవైపు భారత ప్రధాని మోదీ కూడా ప్రస్తుత యుద్ధ వాతావరణం పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగించే అంశమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వివాదాలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవడానికి భారత్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భారత్ ఇతర దేశాలతో ముఖ్యంగా గల్ఫ్ దేశాలతో జరిపే వాణిజ్యంపైన తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతుంది. భారత్ తన ఇంధన అవసరాల కోసం అధికంగా దిగుమతులపై ఆధారపడుతోంది. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతం నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో అంతరాయం కలిగితే దేశీయంగా ఇంధన ధరలు పెరగడం తప్పదని నిపుణులు భావిస్తున్నారు.ఇప్పటికే ముడి చమురు ధరలు సుమారు 10 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావంతో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 91.32కు చేరగా, స్టాక్ మార్కెట్లలోనూ అస్థిరత కనిపించింది. ముఖ్యంగా భారత్ మార్కెట్లు రోజూ నష్టాలను చవి చూస్తున్నాయి.ప్రత్యేకంగా స్ట్రైట్ ఆఫ్ హోర్మజ్ మూసివేత జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధ ప్రభావం దిగుమతుల పైన మాత్రమే కాదు ఎగుమతులపైనా ఉండొచ్చు. భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే బాస్మతి బియ్యం, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ ఉత్పత్తులపై ప్రభావం పడే అవకాశముంది. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,

....(మిగతా2 లో)

## టెహ్రాన్‌పై దాడులు భారతీయ విద్యార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**ఈ కబురు** : ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ పెద్దఎత్తున దాడులు చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అక్కడున్న భారతీయ విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక రాయబార కార్యాలయం కీలక చర్యలు తీసుకుంది. అనేక మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించింది. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

....(మిగతా2 లో)

## మనుషులకీ వన్య ప్రాణులకీ మధ్య సంఘర్షణ నివారణకు 'హనుమాన్'

- అటు వన్యప్రాణులు, ఇటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ హనుమాన్ ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- కట్టుదిట్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- విజయవంతంగా కుంకీ ఆపరేషన్స్
- హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్

....(మిగతా3లో)





ఢిల్లీ కేసులో క్లీన్‌చిట్
..తిరుమల యాత్రకు సిద్ధమైన
కల్వకుంట్ల కవిత

....(3లో)




'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క'
..ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

....(3లో)



గాడిదపై అల్లుడిని ఊరేగించడం.. ఇది హోలీ ఆచారమట..!

....(3లో)



హెలికాప్టర్లు, క్షిపణుల కోసం.. రూ.5వేల కోట్లతో రక్షణ శాఖ ఒప్పందం

....(2లో)

## రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ ..నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులపై రేపు స్పష్టత
- ప్రతిపాదనలతో ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్, మహేష్ గౌడ్
- ఢిల్లీ రావాలని సీఎంకు రాహుల్ గాంధీ సూచన
- ఒక స్థానంలో సింఘ్వీ పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం
- రెండో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై కొనసాగుతున్న ఉత్కంఠ

**ఈ కబురు, హైదరాబాద్ ;**

తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎవరిని పంపాలనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థులను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్టీ అధిష్ఠానంతో చర్చించి రెండు స్థానాలకు పేర్లను ఖరారు చేయనున్నారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రతిపాదనలతో ఢిల్లీకి రావాలని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు

....(మిగతా2లో)



## ఎల్ఐసీ ఆఫీస్‌లో.. భారీ మోసం




- అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ఏజెంట్ల ముఠా
- నకిలీ పత్రాలతో నిరుపేదలపై ఇన్సూరెన్స్
- ఆపై వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి కోట్లు కాజేత
- దాదాపు రూ.1.52 కోట్లు డ్రా

....(మిగతా2 లో)

## చర్చిద్దామన్నారు కానీ ఆలస్యమైందని చెప్పాను ట్రంప్

ఈ కబురు : ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.

....(మిగతా2లో)



## హైడ్రాకు అక్రమ వెంచర్లు కనిపించడం లేదా: కవిత

- నార్సింగిలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయంటూ కవిత ఆందోళన
- ఈ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్
- బీఆర్ఎస్ హయాంలో ఇక్కడి భవనాలకు అనుమతులు ఇచ్చారని విమర్శలు
- కాంగ్రెస్ లంచాలు తీసుకుని వాటికి మళ్లీ అనుమతులు ఇచ్చిందన్న కవిత



**ఈ కబురు, హైదరాబాద్ ;**

హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నార్సింగిలో మూసీ నదిని ఆక్రమించి భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మిస్తున్నారని, వాటిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. అక్కడి వెంచర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇళ్లు కూల్చివేస్తున్న హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని నిలదీశారు. కుత్బుల్లాపూర్, ఖమ్మం వెలుగుమట్ల, మూసీ నది పరిసరాల్లో అన్నీ పేదల ఇళ్లనే కూల్చుతున్నారని ఆరోపించారు

....(మిగతా2లో)

ఒమన్, కువైట్, ఖతార్ దేశాధినేతలకు

# ప్రధాని మోదీ ఫోన్



ఈ పరిణామాల నడుమ ఒమన్, కువైట్, ఖతార్ పాలకులతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ''ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్, కువైట్ యువరాజు సభా అల్‌ఖాలీద్ అల్‌సభా, ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీలతో ప్రధాని మోదీ ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడారు. ఈ దేశాలపై దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. వారి భద్రత గురించి చర్చించారు. దౌత్యమార్గాలు, చర్చల ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని నేతలంతా ఏకాభిప్రాయానికి వచ్చారు'' అని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియాలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇప్పటికే బహ్రెయిన్, సౌదీ అరేబియా, జోర్డాన్, యూఏఈ తదితర దేశాల అధినేతలతో మాట్లాడారు. పశ్చిమాసియాలో దాదాపు 90 లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో 40 వేలమంది, ఇరాన్‌లో 10 వేలమంది ఉన్నారు.

# ఇరాన్- ఇజ్రాయెల్ భీకరయుద్ధం



యెమెన్ వంటి దేశాలు భారత ఎగుమతులకు కీలక మార్కెట్లు కాగా ఎగుమతుల పైనా తీవ్ర ప్రభావం పడుతుంది. స్మార్ట్‌ఫోన్‌ల ఎగుమతుల్లో యూఏఈ ప్రధాన భాగస్వామిగా ఉంది. యుద్ధం వారం రోజులు దాటితే పప్పుధాన్యాల ధరలు పెరిగే అవకాశముంది. అదనంగా డిటర్జెంట్లు, బిస్కెట్లు, టూత్‌పేస్టులు, పెయింట్లు, ప్యాకేజింగ్ వస్తువుల తయారీలో చమురు ఉత్పత్తులు కీలకమైనందున వాటి ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. మొత్తంగా చూస్తే, పశ్చిమాసియాలో యుద్ధం దీర్ఘ కాలం కొనసాగితే భారత్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

**--దేశంలో అల్లర్లు జరిగే అవకాశం....**
**రాష్ట్రాలకు కేంద్రం బిగ్ అలర్ట్**

ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతల వేళ కేంద్రం అప్రమత్త మైంది. ఈ యుద్ధం వేళ చోటు చేసుకొంటున్న పరిణామాల వేళ అన్ని రాష్ట్రాలను అలర్ట్ చేసింది. ముందస్తు చర్యల పైన హెచ్చరికలు చేసింది. దేశంలో ఎక్కడా సామాజిక, మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా పూర్తి అప్రమత్తత తో వ్యవహరించాలని నిర్దేశించింది. అటు యుద్ధం వేళ భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశాలపై కేంద్రం అలర్ట్ అయింది. రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. శాంతి భద్రతలపై ప్రభావం చూపొచ్చన్న ఆందోళనల నేపథ్యంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక లేఖ రాసింది. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పెరుగుతున్న యుద్ధ వాతావరణం, అలాగే అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన సైనిక చర్యల తర్వాత దేశంలో కొన్ని వర్గాలు భావోద్వేగాలకు లోనయ్యే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది.అప్రమత్తంగా ఉండాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ముఖ్యంగా మతపరమైన సభలు, సమావేశాలు, ప్రసంగాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించింది. రెచ్చగొట్టే ప్రసంగాలపై నిఘా హోంశాఖ లేఖలో కీలకంగా ప్రస్తావించిన అంశం రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారి పైన అప్రమత్తం ఉండాలని సూచించింది. సోషల్ మీడియా వేదికల్లో కూడా పుకార్లు, తప్పుడు ప్రచారం వేగంగా వ్యాప్తి చెందే అవకాశముందని, వాటిని వెంటనే అరికట్టాలని సూచించింది. రాష్ట్ర పోలీస్ విభాగాలు, స్థానిక ఇంటెలిజెన్స్ యూనిట్లు, కేంద్ర ఏజెన్సీల మధ్య సమన్వయం పెంచాలని కేంద్రం తెలిపింది. అనుమానాస్పద సమావేశాలు, గుంపులు, విద్వేషపూరిత పోస్టులు, విదేశీ నిధుల ప్రవాహం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకునేలా కంట్రోల్ రూమ్‌లను సిద్ధంగా ఉంచాలని, సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని ఆదేశాలు ఇచ్చింది. కాగా అటు కేంద్రం భారతీయుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ దౌత్యపరమైన చర్యలు చేపడుతోంది.ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అల్లర్లు, ఘర్షణలు తలెత్తకుండా నిరోధించాలనే ఉద్దేశంతో ఈ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా ఉండే సమాచారాన్ని వెంటనే తొలగించాలనీ, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

# టెహ్రాన్‌పై దాడులు

## .. భారతీయ విద్యార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలింపు



''టెహ్రాన్‌పై దాడులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. నగరంలోని అనేక మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించాం. విద్యార్థుల రవాణా, ఆహారం, వసతి ఏర్పాట్లను చూసుకున్నాం. ఎంబసీ సాయాన్ని నిరాకరించిన కొంతమంది మాత్రమే ప్రస్తుతం టెహ్రాన్‌లో ఉన్నారు. ఇంకా ఇరాన్‌లోనే ఉన్న భారతీయ విద్యార్థులు, పౌరులు.. ఇదివరకే జారీ చేసిన సలహాలు పాటించాలి. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఇళ్లకే పరిమితం కావాలి. వీలైనంత వరకు కిటికీలకు దూరంగా ఉండండి. ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరించండి. నిరసనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లొద్దు. భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండండి'' అని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

# హైడ్రాకు అక్రమ వెంచర్లు కనిపించడం లేదా; కవిత

జనం బాటలో భాగంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలను హైడ్రా దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. పేదల ఇళ్లు కూల్చవద్దని కూడా విజ్ఞప్తి చేశామని అన్నారు. మూసీ నది పక్కన ఉన్న పేదల ఇళ్లను కూల్చిన హైడ్రా అధినేత రంగనాథ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూసీ నదిలోనే నిర్మిస్తున్న అక్రమ వెంచర్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అవసరమైతే రంగనాథ్ బుల్డోజర్ తీసుకువచ్చేవరకు ఇక్కడే నిరసన చేపడతామని హెచ్చరించారు. ఖమ్మం కూడా వెళ్లి పేదల తరపున కొట్లాడుతామని అన్నారు. 20 ఏళ్ల క్రితం కట్టిన మధ్యతరగతి వారు కొనుగోలు చేసిన అపార్టుమెంట్‌ను కూలగొట్టాలని చెబుతున్నారని, కానీ ధనికుల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు లేవని మండిపడ్డారు. ఈ అక్రమ భవనాలకు బీఆర్ఎస్ హయాంలో అనుమతులు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. ఆ తర్వాత లంచాలు తీసుకుని నిర్మాణాలకు తిరిగి పర్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. న్యాయం అందరికీ ఒకేలా ఉండాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటామని కవిత అన్నారు.



# రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ

## ..నేడు ఢిల్లీకి సీఎం రేవంత్



సోమవారం శంషాబాద్ విమానాశ్రయం లాంజ్‌లో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్, మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య ఈ విషయంపై ప్రాథమికంగా చర్చ జరిగింది. రాష్ట్రం నుంచి రెండు రాజ్యసభ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కనుండగా, అందులో ఒక సీటును సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీకే తిరిగి కేటాయించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో రెండో స్థానం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై బుధవారం జరిగే సమావేశంలో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# చర్చిద్దామన్నారు ..
# కానీ ఆలస్యమైందని చెప్పాను ట్రంప్

వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు.

**మా వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు: ట్రంప్ పోస్ట్**

ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. ''అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి'' అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. ఇరాన్‌పై దాడుల గురించి కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు) కు ట్రంప్ అధికారికంగా వెల్లడించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి . దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధ్యక్షుడు సమర్థించుకున్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్లు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.




# హెలికాప్టర్లు, క్షిపణుల కోసం..
# రూ.5వేల కోట్లతో రక్షణ శాఖ ఒప్పందం



ఈ కబురు : అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు, మిస్సైళ్ల కొనుగోలు కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL) సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఆరు అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు (ALH MkII), ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణుల కొనుగోలు కోసం రూ.5,083 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు తెలిపింది. అడ్వాన్స్‌డ్ లైట్ మిలిటరీ హెలికాప్టర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ కోసం కొనుగోలు చేస్తుండగా.. Shtil క్షిపణులను భారత నౌకాదళ యుద్ధనౌకలలో మోహరిస్తామని రక్షణ శాఖ పేర్కొంది. ప్రస్తుతం పనిచేస్తున్న హెలికాప్టర్ల కంటే ఇవి అత్యాధునిక లక్షణాలు, సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపింది. ద్వీపాల భద్రత, సముద్ర పర్యావరణ రక్షణ విధులను నిర్వర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సామర్థ్యాన్ని ఇవి మరింత గణనీయంగా పెంచుతాయని డిఫెన్స్ వర్గాలు తెలిపాయి. ఉపరితలం నుంచి గగనతలానికి నిలువుగా ప్రయోగించే ష్టిల్ క్షిపణులు, వాటి అనుబంధ క్షిపణి హోల్డింగ్ ఫ్రేమ్‌ల కోసం రష్యాకు చెందిన సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. విస్తృత శ్రేణి వైమానిక దాడులు ఎదుర్కోవడానికి ఈ హోల్డింగ్ ఫ్రేమ్‌లు ఉపయోగపడతాయంది. Shtil క్షిపణులు భారత నౌకాదళ ప్రతిచర్యలను మరింత వేగవంతం చేస్తాయని పేర్కొంది. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ మెరుగైన మనుగడ సాగిస్తాయంది. ఈ ఒప్పందం వల్ల భారత్ రష్యా మధ్య ఉన్న రక్షణ భాగస్వామ్యం మరింత స్థిరంగా మారుతుందని తెలిపింది.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు



కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది.మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

# ఎల్‌ఐసీ ఆఫీస్‌లో.. భారీ మోసం

**ఈ కబురు, భద్రాచలం ;**

భద్రాచలం ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ పత్రాలతో నిరుపేదలపై ఇన్సూరెన్స్ తీసుకుని.. ఆపై వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి కోట్లు కాజేసినట్లు తెలిసింది. ఈ ఘరానా మోసం ద్వారా దాదాపు రూ.1.52 కోట్లను కాజేసినట్లుగా తేలింది.వివరాల్లోకి వెళ్తే.. అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ఏజెంట్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఎల్‌ఐసీ నిబంధనల్లో లొసుగులను ఆసారాగా చేసుకున్నారు. నేరుపేదల పేరిట నకిలీ పత్రాలతో పాలసీలు తీసుకున్నారు. అనంతరం వారు చనిపోయినట్లుగా తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. అలా కోటిన్నర రూపాయలకు పైగా కాజేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన యంత్రాంగం సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం.

-- ఖజానా ఖాళీ అయ్యాక గానీ నిద్రలేచిన అధికారులు..

అంతా అయిపోయి, ఖజానా ఖాళీ అయ్యాక గానీ ఎల్‌ఐసీ బ్రాంచ్ నిర్వాహకులకు అసలు విషయం బోధపడలేదు. అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడటంతో లబోదిబోమంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత భారీ మొత్తంలో నగదు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. భద్రాచలం బ్రాంచ్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండటంతో పాలసీదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బ్రాంచ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో స్కామ్ జరగడం సాధ్యమేనా? నకిలీ పత్రాలతో వెరిఫై చేయడంలో సిబ్బంది ఎందుకు విఫలమయ్యారు? సాధారణ ప్రజలకు క్లెయిమ్ రావాలంటే నెలల తరబడి తిప్పించే అధికారులు, ఈ కేటుగాళ్లకు ఎలా సహకరించారు? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.





# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



ఆ తర్వాత తాను కూడా బలవన్మరణానికి పాల్పడింది. ఆమె భర్త రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో గరిష్ఠ స్థాయికి విద్యుత్ వినియోగం



భవిష్యత్ విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ స్పీకర్ భట్టి విక్రమార్క వెల్లడించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సమర్థంగా విద్యుత్ పంపిణీ చేస్తున్న సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ వినియోగం అధికమవుతోంది.

## తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు
# ఆకర్షితులవుతున్న యువత : పల్లపు సురేందర్

**నల్లగండ్ల డివిజన్ లో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి** : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి యువత ఆకర్షితులవుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ అన్నారు. నల్లగండ్ల డివిజన్ పరిధిలో సీనియర్ నాయకులు పల్లపు సురేందర్, రాజు నాయక్ ల ఆధ్వర్యంలో యువత మంగళవారం పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. పల్లపు సురేందర్ నాయకత్వంలో నల్లగండ్ల, గోపనపల్లి తండాలకు చెందిన ఇతర పార్టీల యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నగర్ లో గల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా పార్టీలో చేరిన వారికి పల్లపు సురేందర్ కాంగ్రెస్ కండువాలతో ఆహ్వానం పలికారు. అనంతరం పల్లపు సురేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం ఉంటుందని, నూతనంగా పార్టీలో చేరిన వారు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నల్లగండ్ల డివిజన్ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. నల్లగండ్ల డివిజన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాకేష్, టిల్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రేమ్, నరేష్, సురేష్, మదన్ నాయక్, రవి నాయక్, సర్దార్, శ్రీనివాస్ నాయక్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమించిన యువకుడితో మనస్పర్థలు..

**మియాపూర్ లో స్టాఫ్ నర్సు ఆత్మహత్య**

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రేమిస్తున్న యువకుడితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా మియాపూర్ లో ఓ స్టాఫ్ నర్సు తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా నారాయణపేట్ ప్రాంతానికి చెందిన మేఘావత్ సోనిభాయి(20) మియాపూర్ లో గల ఫస్ట్ హెల్త్ ల్యాబ్ లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ రెడ్డి ఎనక్లేవ్ లో గల ప్రైవేటు హాస్టల్ లో నివాసం ఉంటుంది. సోమవారం సోనీ ఉద్యోగినికి వెళ్లకుండా గదిలోనే ఉండగా, గదిలో ఉన్న తోటి స్నేహితులు ఉద్యోగాలకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వారు హాస్టల్ కు తిరిగి రాగా గది లోపలి నుంచి సోనీ గడియ పెట్టుకొని ఉండడంతో చాలా సేపు వారు తలుపు కొట్టారు. సోనీ ఎంతకూ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితులు హాస్టల్ నిర్వాహకులకు సమాచారం అందించగా, వారు కిటికీ తెరిచి చూశారు. లోపల గదిలో ఉన్న సీలింగ్ హుక్కుకు చున్నీతో ఉరివేసుకున్న సోనీ నిర్జీవంగా కనిపించింది. వెంటనే తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా, అప్పటికే సోనీ మృతిచెంది ఉంది.



ఆత్మహత్య చేసుకున్న సోనీ(ఫైల్)

దీంతో వారు ఇచ్చిన సమాచారంతో మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రాథమిక విచారణలో సోని కొంతకాలంగా తన సొంత గ్రామానికి చెందిన ఓ యువకుడితో ప్రేమలో ఉందని, వారి మధ్య ఏర్పడిన విభేదాల కారణంగానే సోనీ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కొమిరిశెట్టి సాయిబాబాను కలిసిన
# మున్నూరు కాపు సంఘ కార్యవర్గం



హఫీజ్ పేట మున్నూరు కాపు కార్యవర్గాన్ని అభినందిస్తున్న సాయిబాబా



మున్నూరు కాపు సంఘం నాయకులు, కార్యవర్గంతో కలిసి కొమ్మిరిశెట్టి సాయిబాబా

**కుల సంఘాలు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి : కొమిరిశెట్టి సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని హఫీజ్ పెట్ డివిజన్ లో నూతనంగా ఏర్పాటైన మున్నూరుకాపు సంఘ కార్యవర్గ సభ్యులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడ లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సాయిబాబాను కలిసిన మున్నూరు కాపు సంఘం కార్యవర్గానికి సాయిబాబా శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా హఫీజ్ పెట్ డివిజన్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వారిని సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ కుల సంఘాలు ఆయా కులాల్లోని పేద ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. హఫీజ్ పేట డివిజన్ లో నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు కార్యవర్గ సభ్యులు మున్నూరు కాపు కులస్థుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సాయిబాబాను కలిసిన వారిలో హఫీజ్ పేట మున్నూరు కాపు సంఘం సలహాదారులు రాజు పటేల్, తాడెం మహేంద్ర పటేల్, అధ్యక్షులు వాసాల రాజు పటేల్, గాజుల మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవి పటేల్, కోశాధికారి మంగళారపు చిన్న తిరుపతి పటేల్, ఉపాధ్యక్షులు మంగళారపు రజనీకాంత్ పటేల్, దేవులపల్లి బాలరాజు పటేల్, సుంకరి చందు పటేల్. కార్యదర్శి కాశెట్టి రమేష్ పటేల్ సుంకరి ఆంజనేయులు పటేల్, జాయింట్ సెక్రెటరీ కోలిపల్లి సతీష్ పటేల్ తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ కేసులో క్లీన్‌చిట్
### .. తిరుమల యాత్రకు సిద్ధమైన కల్వకుంట్ల కవిత



ఈ కబురు, హైదరాబాద్ ;
ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ కేసు నుంచి విముక్తి లభించడంతో స్వామివారికి మొక్కు చెల్లించుకోవాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కాలినడకన అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమల కొండకు చేరుకోవాలని సంకల్పించారు. ఆమె పర్యటన వివరాలను సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 5వ తేదీన కవిత తిరుపతికి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం అలిపిరి నుంచి కాలినడకన కొండపైకి వెళ్లనున్నారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, ఆ మరుసటి రోజు అంటే 6వ తేదీన ఉదయం శ్రీవారిని దర్శించుకుని తన మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. సీబీఐ సరైన ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ కవితతో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి విముక్తుల్ని చేసింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు పెట్టారని నిందితులు ఆరోపించారు. కాగా, ఈ కేసులో విచారణ ఎదుర్కొన్న కవిత దాదాపు 6 నెలల పాటు తీహార్ జైలులో ఉన్నారు. అయితే, కవిత తిరుమల పర్యటన కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితం కాదని, దీని వెనుక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆమె తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రానున్న రెండు నెలల్లో కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల్లో చురుగ్గా ఉంటున్న ఆమె, ఈ పర్యటన తర్వాత తన రాజకీయ కార్యాచరణను మరింత వేగవంతం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.

## మనుషులకీ వన్య ప్రాణులకీ మధ్య
# సంఘర్షణ నివారణకు 'హనుమాన్'

**ఈ కబురు :**
'వసుధైక కుటుంబం అనే ఉన్నతమైన సిద్ధాంతాన్ని బలంగా నమ్మే దేశం మనది. సమస్త జీవకోటి, వన్య ప్రాణులు ఇందులో అంతర్భాగం. మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యత, వన్యప్రాణుల సంరక్షణ అత్యంత ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకొనే అటవీ శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ ప్రాజెక్ట్ (హీలింగ్ అండ్ నర్చ్యూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్) ముందుకు తీసుకొచ్చామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వన్య ప్రాణుల వల్ల పంట, పశు సంపదకి నష్టంతోపాటు మానవ భద్రతకు ముప్పు కలిగించే సంఘటనలు పెరుగుతున్నందున ఈ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం ఉదయం హనుమాన్ పేరుతో 100 ప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. వీటిలో వన్య ప్రాణుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అంబులెన్స్, రెస్క్యూ వాహనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇంఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "హనుమాన్ ప్రాజెక్ట్ మానవవన్యప్రాణి మధ్య ఉన్న సంఘర్షణను నివారించడం, తగ్గించడం కోసం రూపకల్పన చేసిన సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమం. ఈ ప్రాజెక్టు ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ, వారి జీవనోపాధికి భద్రత కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు మరింత కట్టుదిట్టంగా ముందుకు తీసుకువెళ్లబోతున్నాం. వన్యప్రాణులను సంరక్షిస్తూనే పంటలు, పశువులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ చేపట్టేలా హనుమాన్ ప్రధాన కర్తవ్యం. ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు తక్షణ ప్రతిస్పందన, ఉపశమన చర్యలు, పరిహారం చెల్లింపు వ్యవస్థల్ని హనుమాన్ ఫౌండేషన్ నిర్వర్తిస్తుంది. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పోలీస్ శాఖలతోపాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తుంది.

* గ్రామ స్థాయిలో 'వజ్ర' బృందాలను సిద్ధం చేస్తున్నాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా తీసుకొచ్చిన ఈ హనుమాన్ ప్రాజెక్ట్ కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించాం. అందులో 93 ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలు కాగా, మరో 7 వాహనాలు వన్యప్రాణుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అవసరమైన అంబులెన్స్ లు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్మెంట్ సెంటర్లు, 19 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచాం. ప్రతి వాహనంలో అటవీ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్య సిబ్బంది, ట్రైబల్ హెల్పర్స్ (గిరిజన), పారా వెటరేనియన్స్ తో కూడిన పూర్తి స్థాయి వ్యవస్థ ఉంటుంది. గ్రామ స్థాయిలో వన్య జీవి రక్షక్ (వజ్ర)లను అటవీ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నాం. వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నాం. గ్రామ స్థాయిలో పాములు, ఇతర జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా వారికి శిక్షణ ఇచ్చాం.

* పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ వన్యప్రాణి సంఘర్షణలో జరిగిన నష్టానికి ఎప్పటికప్పుడు పరిహారం కూడా చెల్లించేస్తున్నాం. 20252026 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా కేసులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,107 వరకు నమోదు కాగా పరిహారం కింద దాదాపు రూ. 4 కోట్లు చెల్లించాం. ఇది బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందించిన భరోసా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇచ్చే ఎక్స్ గ్రేషియా, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారం మొత్తాన్ని గణనీయంగా పెంచాం. జంతువుల దాడిలో మనిషి చనిపోతే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గాయపడిన వారికి ఇచ్చే పరిహారం రూ.2 లక్షలు చేశాం. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నాం. చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ఇప్పటి వరకు 8 ఆపరేషన్స్ విజయవంతంగా పూర్తి చేసి ఏనుగుల బారి నుంచి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించాం.



--ఏఐ సహాయంతో వన్యప్రాణుల కదలికలు

వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. దీనిని పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రారంభించాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో జంతువుల వచ్చే ముందు ముందస్తు హెచ్చరికలు ఇచ్చే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. వన్య ప్రాణుల వల్ల మానవ భద్రతకు ముప్పు కలగకుండా వశుధైక కుటుంబంలా కలిసి బతికే లక్ష్యంతో హనుమాన్ ప్రాజెక్ట్ ను తీసుకొచ్చాం. ఈ ప్రాజెక్ట్ కోసం అటవీశాఖ అధికారులు, ఫ్రంట్ లైన్ సిబ్బంది ఎంతో అంకితభావంతో కష్టపడి పని చేశారు. వారందరి సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అలాగే వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటి, ఈస్టర్న్ ఘాట్స్ కన్జర్వేషన్ సొసైటీ వంటి నిబద్ధతతో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. కలిసి జీవిద్దాం. కలిసి అభివృద్ధి చెందుదాం" అని అన్నారు.

* 100కు పైగా హనుమాన్ వాహనాలకు ప్రారంభోత్సవం

పూర్తి అధునాతన సాంకేతికతతో రూపొందించిన 100కు పైగా హనుమాన్ వాహనాలను పవన్ కళ్యాణ్ జెండా ఊపి ప్రారంభించారు. అందులో 19 ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు ఉన్నాయి. వన్య ప్రాణులు గాయపడిన సందర్భాల్లో వాటిని తరలించేందుకు వీలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో వీటిని సిద్ధం చేశారు. వీటితోపాటు స్పాట్ లో చికిత్స అందించేందుకు వీలుగా అంబులెన్స్ లు, కాంపా వాహనాలు ఉన్నాయి. హనుమాన్ డిజిటల్ యాప్, అధునాతన సాంకేతికతతో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జి.పి.ఎస్. ట్రాకింగ్ సిస్టంను ప్రారంభించారు. అంతకు ముందు అటవీశాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది, సేవలు అందిస్తున్న ఎన్జీవోలకు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా తిలకించారు. మొదట ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు, హనుమాన్ అంబులెన్స్ లను పరిశీలించి సౌకర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ పరిధిలో సంచరించే వన్యప్రాణులు వివరాలు, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రెస్క్యూ ఆపరేషన్స్ లో వినియోగించే కిట్లు, జనావాసాల్లోకి వచ్చిన పులులు లాంటి వన్య మృగాలను బంధించే బోన్లు, అటవీశాఖ పరిధిలో పెరిగే ఔషదాల మొక్కలు, ఉత్పత్తుల వివరాలను అధికారులు, ఎన్జీవోలు గ్యాలరీల రూపంలో పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఈస్ట్రన్ ఘాట్స్ లో సంచరించే కింగ్ కోబ్రా తదితర పాముల వివరాలు తెలియజేస్తూ ఇచ్చిన ప్రజంటేషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు పి. మల్లికార్జునరావు, అటవీశాఖ ఐటీ సలహాదారు పి. నాగేశ్వరరావు, అటవీశాఖ సలహాదారు అంకారావు, రాష్ట్ర మెడికల్ డెవలప్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా, 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క'
### .. ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

ఈ కబురు, జడ్చర్ల : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ సహా ముగ్గురిని సస్పెండ్ చేసింది. డ్యూటీ డాక్టర్ మునిశాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకుంది. జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్



కమిషనర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై ఆయన విచారణ చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ మునీషా, ఎంఎన్ఓ రవిప్రకాష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

## గాడిదపై అల్లుడిని ఊరేగించడం..
## ఇది హోలీ ఆచారమట..!

ఈ కబురు : దేశమంతటా రకరకాల రంగులతో హోలీ చేసుకుంటుంటే ఆ ఊర్లో మాత్రం కొత్త అల్లుడిని గాడిద మీద ఊరేగించి వేడుకలు చేసుకున్నారు. ఈ వింత ఆచారానికి మహారాష్ట్రలోని బీడ్ జిల్లా విడ గ్రామం వేదికైంది. 90 ఏళ్లుగా ఇక్కడ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారట. హోలీ పండుగకి వారం రోజుల ముందు ఆ గ్రామంలో యువకులంతా బృందంగా మారి కొత్త అల్లుళ్ల కోసం అన్వేషిస్తారు. కొత్త అల్లుడు దొరికిన తర్వాత అతడు పారిపోకుండా ఉండేందుకు నిరంతరం వెన్నంటే ఉంటారు. ఈ ఏడాది గాడిదపై ఊరేగింపు కోసం ఒక వ్యక్తి ఎంపికయ్యాడు. కైజీ ప్రాంతానికి చెందిన అతను పెళ్లి తర్వాత విడ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. హోలీ సందర్భంగా అతనికి రంగులు పూసి గాడిదపై ఊరేగించారు. అనంతరం కొత్త దుస్తులు, ఇతర కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి మాట్లాడుతూ.. "గాడిదపై ఊరేగింపునకు ఎంపిక అవుతానని ఊహించలేదు. కానీ, స్థానిక సంప్రదాయాలను గౌరవించి



వేడుకల్లో భాగంగా ఇందుకు అంగీకరించా" అని తెలిపాడు. 1930ల్లో ఆనంద్‌రావ్ దేశ్‌ముఖ్ ఈ ఆచారాన్ని ప్రారంభించినట్లు స్థానికులు చెబుతుంటారు. హోలీ పండగ రోజున తన ఇంటికి వచ్చిన కొత్త అల్లుడు.. రంగులు పూస్తుంటే నిరాకరించాడట. దీంతో అతడిని ఒప్పించి రంగులు జల్లడమే కాకుండా.. ముస్తాబు చేసిన గాడిదపై కూర్చొబెట్టి ఊరంతా తిప్పారట. అదే ఆచారం కొనసాగుతూ వస్తోంది. అయితే, కొన్ని కారణాల వల్ల గతేడాది ఆ వేడుకను నిర్వహించలేదు. మళ్లీ ఈసారి సంప్రదాయాన్ని కొనసాగించడం విశేషం.

## ఒక రీఛార్జ్.. 72 రోజుల వ్యాలిడిటీ!




రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్-ఐడియా వంటి టెలికామ్ కంపెనీలు ఎప్పటికప్పుడు తమ కస్టమర్ల కోసం లేటెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ ప్రవేశపెడుతున్న సమయంలో.. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఈ లేటెస్ట్ ప్లాన్ తీసుకొచ్చింది. 485 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే 72 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది.

బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిన రూ. 485 రీఛార్జ్ ప్లాన్ ద్వారా 72 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. రోజుకి 2.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లు పొందవచ్చు. ఆఫర్ వ్యాలిడిటీ ఉన్నంత వరకు అపరిమిత కాల్స్ ఆస్వాదించవచ్చు. అయితే ఈ ఆఫర్ కేవలం మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ వెల్లడించింది.




## ఉద్రిక్తతలు ఉన్నా బంగారం, వెండి ధరలు ఎందుకు పడ్డాయ్?

అంతర్జాతీయంగా ఎక్కడ ఏ మూల యుద్ధం జరిగినా బంగారం, వెండి ధరలు పెరుగుతుంటాయి. వీటి ధరల పెరుగుదలను అనిశ్చితికి కొలమానంగానూ భావిస్తుంటారు. తాజాగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వేళ బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగాయి. కానీ, మళ్లీ వెంటనే దిగొచ్చాయి. సమీప భవిష్యత్‌లో ఉద్రిక్తతలు చల్లారుతాయన్న సూచనలు లేనప్పటికీ.. వీటి ధరలు దిగొచ్చాయి ఎందుకు?

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త ఆపరేషన్ కారణంగా అంతర్జాతీయంగా సోమవారం బంగారం, వెండి ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు 5400 డాలర్ల పైకి చేరగా.. వెండి ఔన్సు 95 డాలర్ల వరకు చేరింది. మంగళవారం నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి దాదాపు 10 శాతం పతనమై 82 డాలర్లకు స్థాయికి దిగి వచ్చింది. బంగారం కూడా 5174 డాలర్లకు చేరుకుంది. దీన్ని అనుసరించి దేశంలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.67 లక్షలకు, వెండి కిలో రూ.2.71 లక్షలుగా ఉన్నాయి.

ఎందుకు పడ్డాయి?

ఇతర కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ ఇండెక్స్ బలపడి ఒక నెల గరిష్ఠానికి చేరింది. గడిచిన ఐదు రోజుల్లో 1.4 శాతం బలపడింది. డాలర్ విలువ పెరిగినప్పుడు ఇతర కరెన్సీ హోల్డర్లకు వెండి ఖరీదవుతుంది. దీంతో కొనుగోళ్లను తగ్గిస్తుంది. ఈ కారణంగానే బంగారం, వెండికి డిమాండ్ తగ్గింది.

తాజా గరిష్ఠాల వద్ద బంగారం, వెండిలో ప్రాఫిట్ బుకింగ్ కనిపించడమూ వీటి ధరల తగ్గుదలకు కారణమని అనలిస్టులు పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాలో మరోసారి ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అదే జరిగితే ఫెడ్ ఇప్పట్లో కీలక వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చు. దీర్ఘకాలంలో బాండ్లపై ప్రతిఫలం అధికంగా ఉన్నప్పుడు బంగారం, వెండికి డిమాండ్ సహజంగానే తగ్గుతుంది.

## హోర్ముజ్ జలసంధి వద్ద ట్రాఫిక్ జామ్..
## 700లకు పైగా ట్యాంకర్లు అక్కడే..!



పంచ చమురు రవాణాకు జీవనాడి లాంటి హోర్ముజ్ జలసంధిలో ఇప్పుడు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ జలసంధిని మూసివేశామని, నౌకలు వస్తే నిప్పు పెడతామని ఇరాన్ హెచ్చరించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఈ పరిణామాలతో హోర్ముజ్ (Strait Of Hormuz) మార్గంలో 700లకు పైగా ట్యాంకర్లు నిలిచిపోయాయి. వీటిలో అత్యధికం చమురు నౌకలే. దీంతో ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ ప్రభావం చమురు ధరల (Oil Prices) పై పడుతోంది. మారిటైమ్ అనలిటిక్ సంస్థలు విండ్‌వర్డ్, కెప్లెర్ డేటా ప్రకారం.. హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు అధికారిక ప్రకటనలేవీ రాలేదు. కానీ, ఇరాన్ (Iran) హెచ్చరికలతో ఈ మార్గంలో నౌకల రాకపోకలు దాదాపు స్తంభించాయి. మార్చి 1న 2.8 మిలియన్ బ్యారెళ్లతో కేవలం మూడు ట్యాంకర్లు మాత్రమే హోర్ముజ్‌ను దాటాయి. 2026 ప్రారంభం నుంచి ఈ మార్గంలో ఇప్పటివరకు రోజుకు సగటున 19.8 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా జరిగింది. దీన్నిబట్టి చూస్తే.. ప్రస్తుతం చమురు రవాణా (Oil Supply) 86శాతం మేర తగ్గింది. ఇక, మార్చి 2వ తేదీ ఉదయం కేవలం ఒక చిన్న ట్యాంకర్, కార్గోషిప్ మాత్రమే ఈ జలసంధి మీదుగా ప్రయాణించాయి. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధికి అటూఇటూ 706 ఇరాన్ కాకుండా ఇతర దేశాల ట్యాంకర్లు నిలిచిపోయినట్లు విండ్‌వర్డ్, కెప్లెర్ డేటాతో వెల్లడైంది. వీటిల్లో 334 చమురు రవాణా నౌకలే కావడం గమనార్హం. మిగిలినవి ఇతర కార్గో నౌకలు. ఇక గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోనూ కొన్ని నౌకలు నిలిచిపోయాయి.హోర్ముజ్ మార్గంలో రోజులతరబడి రవాణా నిలిచిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జలసంధి మార్గంలో ట్యాంకర్ల రద్దీ పెరగడం, డెలివరీలు ఆలస్యమవడం వంటి కారణాలు చమురు కొరతకు దారితీసే అవకాశం ఉంది. ఇప్పటికే గల్ఫ్ జలాల్లోకి వెళ్లే నౌకలకు బీమా ప్రక్రియను చాలా కంపెనీలు కఠినతరం చేశాయి. అటు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే నౌకల ప్రీమియంలు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ కలిసి చమురు ధరలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

భారత్‌పై ప్రభావమెంత..?

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియా, ఐరోపాలోని కొన్ని రిఫైనరీలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. యూఎస్ గల్ఫ్ కోస్ట్, పశ్చిమ ఆఫ్రికా, బ్రెజిల్, రష్యా నుంచి చమురు కొనుగోళ్ల వైపు దృష్టిపెట్టాయి. అయితే, భారత్, చైనా మాత్రం ముడి చమురు దిగుమతుల కోసం హోర్ముజ్ మార్గం పైనే అధికంగా ఆధారపడుతున్నాయి. మన దేశ అవసరాలకు తగిన ఎల్‌పీజీలో 8085శాతం దిగుమతుల రూపంలోనే లభిస్తోంది. ఇందులో అత్యధికం గల్ఫ్ ఉత్పత్తిదారుల నుంచి హోర్ముజ్ జలసంధి మార్గంలోనే వస్తోంది. ప్రస్తుతం మన వద్ద ఉన్న ఎల్‌పీజీ నిల్వలు రెండు వారాలు మాత్రమే సరిపోతాయని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ మార్గం నుంచి రోజుకు సగటున 2.5 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. మన దేశ మొత్తం దిగుమతుల్లో ఇది 50 శాతానికి సమానం. ఈ సరఫరా నిలిచినా, మన నిల్వలు 60 రోజుల వరకు సరిపోతాయి. అందువల్ల, ప్రస్తుతానికి భారత్‌పై పెద్ద ప్రభావం లేకపోయినప్పటికీ.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సుదీర్ఘంగా కొనసాగితే మాత్రం ఇబ్బందులు తప్పవని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మార్గం నిరవధికంగా మూతపడితే భారత్ తక్షణం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశీయ సరఫరాను రక్షించేందుకు మన దేశ పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ఆంక్షలు విధించే అవకాశం ఉన్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, అవసరమైన చర్యలు చేపడతామని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు.

భగ్గుమంటున్న ధరలు..

తాజా పరిణామాలు చమురు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర వరుసగా మూడోరోజు పెరిగి దాదాపు 80 డాలర్లుగా ఉంది. యూరోపియన్ గ్యాస్ ధర 40శాతానికి పైగా పెరిగింది. సౌదీ అరేబియాలోని అతిపెద్ద రిఫైనరీల్లో ఒకటైన రాస్ తనురా చమురుశుద్ధి కేంద్రంపై ఇరాన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు. సాధారణంగా ఇక్కడ రోజుకు 5.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. ప్రపంచ మార్కెట్‌లో సౌదీ చమురు వాటాలో ఇది దాదాపు 16 శాతానికి సమానం. ఇది కూడా చమురు ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

## వార్ ఎఫెక్ట్.. సరఫరా గొలుసుపై ప్రభావం ఉండకపోవచ్చు: చంద్రశేఖరన్

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్ అమెరికా, ఇరాన్ యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ స్పందించారు. ప్రస్తుత యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసును పెద్దగా ప్రభావితం చేయబోదన్నారు. ఝార్ఖండ్‌లో జంషెడ్‌పుర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో పనిచేస్తున్న తమ ఉద్యోగుల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

''అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ రూపంలో ఎదురైన భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ సరఫరా గొలుసుపై ప్రభావం ఉండదనే భావిస్తున్నా. త్వరలోనే ఈ పరిస్థితులు సర్దుకుంటాయని ఆశిస్తున్నా. పశ్చిమాసియా నుంచి సున్నపురాయి వంటి ముడి పదార్థాలను టాటా స్టీల్ సేకరిస్తోంది. అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను కంపెనీ వెతుకుతోంది. ప్రస్తుతానికి సరిపడా నిల్వలు ఉన్నాయి. ఈ యుద్ధ వాతావరణం కంపెనీపై ఎలాంటి ప్రభావం చూపదు. కొన్ని రోజులు కంపెనీ కార్యకలపాలకు ఆటంకాలు ఎదురవ్వచ్చు. కానీ పరిస్థితులు సర్దుకున్నాక కంపెనీ సాధారణ స్థితికి చేరుకుంటుంది'' అని చంద్రశేఖరన్ అన్నారు. అలాగే, ఆర్థిక ప్రయోజనాల కన్నా ఉద్యోగుల భద్రతకే టాటా గ్రూప్ ప్రా



ధాన్యతనిస్తుందన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో పనిచేస్తున్న సిబ్బంది భద్రత కోసం మూడు రోజులుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగులందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

## ఎక్స్‌లో అశ్లీల కంటెంట్ నిషేధం?




ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో అశ్లీల కంటెంట్ లేదా అడల్ట్ కంటెంట్ మీద భారత ప్రభుత్వం పరిమితులు విధించినట్లు కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై ఎక్స్ యూజర్లు సైతం స్పందిస్తున్నారు.

భారత ప్రభుత్వం సాధారణంగా అడల్ట్ కంటెంట్ నిషేధంపై చాలా సీరియస్‌గా ఉంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఇలాంటి కంటెంట్ అందించే చాలా ప్లాట్‌ఫామ్‌ల మీద కఠిన చర్యలు తీసుకుంది. అయితే ఇప్పుడు ఎక్స్‌కు కూడా పరిమితులు విధించిందా? అనే విషయంపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

భారతదేశంలో ఎక్స్‌లో 18+ కంటెంట్ నిషేధంపై మస్క్ కూడా అధికారికంగా వెల్లడించలేదు. కానీ సోషల్ మీడియా వేదికగా యూజర్లు దీనికి సంబంధించిన పోస్టులు చేస్తూనే ఉన్నారు. ఆ పోస్టుల ప్రకారం.. అడల్ట్ కంటెంట్ తొలగిస్తున్నట్లు తెలుస్తోంది.

## దేశంలో టాప్5 ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవే. ..ఓలా స్థానమెంత?



: విద్యుత్ స్కూటర్ల మార్కెట్‌లో సంప్రదాయ ద్విచక్ర వాహన కంపెనీలు దూసుకెళుతున్నాయి. ఫిబ్రవరిలోనూ టీవీఎస్, బజాజ్ సత్తా చాటాయి. అత్యధిక వాహన విక్రయాలతో దూసుకెళుతున్నాయి. మరోవైపు ఒకప్పుడు ఈవీ మార్కెట్‌లో అగ్రస్థానంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ సంస్థ మార్కెట్ వాటా భారీగా పతనమైంది. టాప్5లోనూ చోటు దక్కించుకోలేకపోయింది. గ్రీవ్స్ కాటన్ ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ తొలిసారిగా టాప్5లో చోటు సాధించింది. ఇక ఫిబ్రవరిలో మొత్తం 1,11,680 యూనిట్ల విద్యుత్ ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాదితో పోలిస్తే 46% వృద్ధి నమోదైంది.

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటర్స్ ఫిబ్రవరిలో 31,600 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 67% వృద్ధి నమోదు చేసింది. మరో ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో 25,323 యూనిట్ల విక్రయాలతో ఈ జాబితాలో రెండోస్థానంలో నిలిచింది. ఈ సంస్థ విక్రయిస్తున్న చేతక్ విక్రయాల్లో గతేడాదితో పోలిస్తే 17% వృద్ధి నమోదైంది.

ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఈ జాబితాలో మూడో స్థానాన్ని ఆక్రమించింది. గతేడాదితో పోలిస్తే 72% వృద్ధి నమోదు చేసి 20,581 యూనిట్లను విక్రయించింది. విడా బ్రాండ్‌పై విద్యుత్ ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్న హీరో మోటోకార్ప్ ఫిబ్రవరిలో 12,512 యూనిట్లను విక్రయించింది. గతేడాదితో పోలిస్తే 364% రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. ఇక ఈ జాబితాలో గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్ అనుబంధ సంస్థ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ అంచనాలను మించి వృద్ధి సాధించింది. ఓలా కంపెనీని వెనక్కి నెట్టి తొలిసారి టాప్ 5కి ఎగబాకింది. గతేడాదితో పోలిస్తే 27% వృద్ధితో 4,725 యూనిట్లను విక్రయించింది. యాంపియర్ పేరిట ఈ సంస్థ ద్విచక్ర వాహనాలను విక్రయిస్తోంది.

## ఏ దేశంలో చమురు నిల్వలెంత? పెట్రోల్, డీజిల్ ధరల మాటేంటి?

మొన్నటికి మొన్న వెనెజువెలా మీద అమెరికా దాడి చేసింది. ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోని అపహరించుకొని వెళ్లింది. అయితే ఆ ఘటన అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై పెద్దగా ప్రభావం పడలేదు. కొన్ని వారాలు తిరగక ముందే ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాయంతో అగ్రరాజ్యం దాడికి పాల్పడింది. ఇరాన్ సైతం అమెరికా సైనిక స్థావరాలు కలిగిన ఇరుగుపొరుగు దేశాలపై దాడులకు తెగబడుతోంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ సంధిని మూసివేసింది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు అమాంతం పెరిగాయి. దీంతో భారత్‌లోనూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న భయాలు నెలకొన్నాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు కలిగిన దేశంపై దాడి జరిగినప్పుడు పెద్దగా కనిపించని స్పందన.. ఇరాన్‌పై దాడి విషయంలో మాత్రం ఎందుకీ కలవరం?

**ఒపెక్ దేశాలే జీవనాడి**

ప్రపంచ చమురు మార్కెట్‌ను శాసించేది ఒపెక్ దేశాలే. ఇరాన్, ఇరాక్, కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ దేశాలతో పాటు వెనెజువెలా, ఆఫ్రికాలోని కొన్ని దేశాలతో కలిసి ఒపెక్ ఏర్పడింది. రష్యాతో కలుపుకొంటే ఒపెక్+ దేశాలుగా వ్యవహరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అత్యధికంగా ఈ దేశాల వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.7 ట్రిలియన్ బ్యారెళ్ల ముడి చమురు నిల్వలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**టాప్ దేశాలు ఇవే.. (బిలియన్ బ్యారెళ్లు)**

**వెనెజువెలా (303)- ప్రపంచంలోనే ఎక్కువ నిల్వలు ఉన్నది ఇక్కడే. ఇక్కడి చమురు 'హెవీ క్రూడ్' అవ్వడం వల్ల వెలికితీత కష్టం**

సౌదీ అరేబియా (267) ఇక్కడ చమురు తీయడం చాలా సులభం, తక్కువ ఖర్చుతో కూడుకున్నది.

ఇరాన్ (209) భారీ నిల్వలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ఆంక్షల వల్ల ఎగుమతులపై ప్రభావం.

కెనడా (163) ఇక్కడ చమురు ఎక్కువగా 'ఆయిల్ సాండ్స్' రూపంలో ఉంటుంది.

ఇరాక్ (145) పశ్చిమాసియాలో కీలకమైన చమురు ఉత్పత్తిదారు

యూఏఈ (113) అబుదాబిలో అత్యధిక నిల్వలు

కువైట్ (102) చిన్న దేశమైనప్పటికీ, ప్రపంచ చమురులో దాదాపు 6% వాటా

రష్యా (80) ఐరోపా, ఆసియా దేశాలకు ప్రధాన చమురు సరఫరాదారు. ప్రస్తుతం ఆంక్షలు ఎదుర్కొంటోంది.

అమెరికా (74) నిల్వల పరంగా 9వ స్థానంలో ఉన్నా, టెక్నాలజీ వల్ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే నంబర్ 1.

లిబియా (48) ఆఫ్రికా ఖండంలో అత్యధిక చమురు నిల్వలు కలిగిన దేశం

**నిల్వలు కాదు.. ఉత్పత్తే కీలకం**

సాధారణంగా చమురు నిల్వలు అధికంగా ఉన్న దేశానికి ప్రపంచాన్ని శాసించే శక్తి ఉంటుంది. కానీ, నిల్వల కంటే ఎంత ఉత్పత్తి చేశారనే దానిమీద ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఆధారపడి ఉంటుంది. ఇందుకు వెనెజువెలానే ప్రధాన ఉదాహరణ. పేరుకే అత్యధిక నిల్వలు ఉన్న దేశమైనప్పటికీ.. రాజకీయ కారణాలు, చమురు వెలికితీతకు సరైన టెక్నాలజీ లేకపోవడం వల్ల ఆ దేశంలో ఉత్పత్తి తక్కువ. అమెరికా విషయానికొస్తే.. నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ ఆధునిక సాంకేతికతతో భూమి పొరల నుంచి చమురును తీస్తూ అతిపెద్ద ఉత్పత్తిదారుల్లో ఒకటిగా నిలుస్తోంది. మన దేశంలో చమురు నిల్వలు చాలా తక్కువ. సుమారు 4.5 నుంచి 5 బిలియన్ బ్యారెళ్లు ఉంటాయని అంచనా. అందుకే మన చమురు అవసరాలు తీర్చుకోవడానికి 85 శాతం దిగుమతి చేసుకునే చమురుపై ఆధారపడుతున్నాం.

**ఇరాన్ విషయంలో ఎందుకీ ఉలికిపాటు?**

ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20%, మనదేశానికి 3550% హోర్ముజ్ జలసంధి మార్గంలోనే జరుగుతోంది. ఈ మార్గాన్ని మూసివేస్తే, చమురు రవాణా నౌకలు అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఇరాన్‌పై దాడి నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83 డాలర్లకు చేరింది. ఇరాన్ ఉద్రిక్తతలకు మునుపు 70 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చింది.

**పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?**

హోర్ముజ్ సంధి మూసివేతతో ముడి చమురు రవాణాకు ఆటంకం ఏర్పడనుంది. అయినప్పటికీ మన దేశంలో చమురు నిల్వలకు ఇప్పటికిప్పుడు వచ్చే నష్టమేదీ లేదని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్ యుద్ధం లేదా సంక్షోభ సమయాల్లో వాడుకోవడానికి భూగర్భంలో భారీ చమురు నిల్వలను ఏర్పాటు చేసింది. విశాఖపట్నం, మంగళూరు, పడూరులో ఉన్న ఈ నిల్వలు 9.5 రోజుల అవసరాలకు సరిపోతాయి. ఒడిశాలోని చండిఖోల్, రాజస్థాన్‌లోని బికనేర్ వంటి మరో రెండు నిల్వ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఆయిల్ కంపెనీల వద్ద ఉన్న నిల్వలు దాదాపు 60 రోజులకు పైగా సరిపోతాయి. మొత్తంగా 74 నుంచి 80 రోజుల వరకు సరిపడా ఇంధన రక్షణ కవచం ఉంది.

అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదు. అంతర్జాతీయంగా తక్కువ ధరలు ఉన్నప్పుడు కూడా వీటి ధరలను చమురు కంపెనీలు తగ్గించలేదు. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ రేట్లు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆ సమయంలో చమురు సంస్థలు తమ మార్జిన్లను పెంచుకున్నాయి. ప్రస్తుతం 10 శాతం మేర ధరలు పెరిగిన నేపథ్యంలో చమురు ధరలను పెంచకూడదని ప్రభుత్వం భావిస్తోంది. పెరిగిన ధరలతో నష్టం వాటిల్లినా ఆయా కంపెనీలు నష్టాలను సర్దుబాటు చేసుకోనున్నాయి. చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ దిగుమతి కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



## తన జీవితంలోని చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్న స్నేహ



తెలుగు వెండితెరపై తనదైన అభినయంతో హోమ్లీ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి స్నేహ, తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒక భయంకరమైన ప్రమాదం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన ఈమె, అంతకుముందే ఒకానొక దశలో తన సినీ ప్రయాణం ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడించారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో జరిగిన ఒక ఘోర ప్రమాదం తన జీవితాన్ని తలకిందులు చేసిందని, ఆ సమయంలో పడిన వేదనను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ప్రమాదంలో కాళ్లు, చేతులు, వీపు భాగానికి తీవ్రమైన గాయాలయ్యాయని స్నేహ తెలిపారు. కనీసం మంచం మీద నుండి లేచి నిలబడాలన్నా ఎనిమిది నెలల సమయం పడుతుందని వైద్యులు చెప్పడంతో, ఇక తను కెమెరా ముందుకు రావడం అసాధ్యమని అనుకున్నానని చెప్పారు. సరిగ్గా అదే సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ 'పార్థిబన్ కనవు' (తెలుగులో 'అంజలి ఐ లవ్యూ') కథతో ఆమెను సంప్రదించారు. తాను కదల్లేని స్థితిలో ఉన్నానని తెలిసినా, ఆ దర్శకుడు చూపిన నమ్మకం, ఇచ్చిన ప్రోత్సాహం తనలో కొత్త ఆశలు చిగురింపజేశాయని స్నేహ తెలిపారు. ఆ మొండి ధైర్యంతోనే కోలుకుని మళ్లీ మేకప్ వేసుకున్నానని, ఆ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పిందని ఆమె వివరించారు.



## వరప్రసాద్ గారు.. 50 రోజులు పూర్తి చేసుకున్నారు!

ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడీ సినిమా మరో మైలురాయిని అధిగమించింది. ప్రస్తుతం ఓటీటీల ప్రభావంతో థియేట్రికల్ రన్ రెండు మూడు వారాలకే పరిమితమైపోతున్న ఈ తరుణంలో.. ఈ సినిమా 109 సెంటర్లలో విజయవంతంగా 50రోజులు పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వినోదభరిత కుటుంబ కథా చిత్రంగా ముస్తాబైన ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. దీంట్లో చిరుకు జోడీగా నయనతార నటించగా.. హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో అలరించారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు.

## స్పోర్ట్స్ డ్రామాలో శ్రీలీల?

"నువ్వు నా వాడివి.. నువ్వే నా ప్రతి ఆనందానివి" అంటూ ఇంకా పేరు ఖరారు కానీ ఓ సినిమాతో అలరించడానికి ముస్తాబవుతున్నారు బాలీవుడ్ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, శ్రీలీల. ఇంకా ఈ చిత్రం విడుదల కాకముందే.. ఈ జంట ఇప్పుడు మరో సినిమా కోసం జోడీ కట్టడానికి సిద్ధమైంది. 'చందు ఛాంపియన్' దర్శకుడు కబీర్ ఖాన్‌తో కార్తిక్ ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం.

"స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కార్తిక్ కిక్ బాక్సింగ్ కోచ్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన నటించడానికి శ్రీలీలతో చర్చలు చేస్తున్నారు. నిజ జీవితాధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలోని తన పాత్ర కోసం కార్తిక్ శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైన ఈ చిత్రం 2027లో థియేటర్లలోకి వచ్చే అవకాశముంద"ని శ్రీలీల సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి తన స్టెప్పులతో అదరగొట్టే ఈమె.. మరోసారి కార్తిక్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.



### అందుకు షూటింగ్ ఆపేద్దామన్నా..
## రామ్‌చరణ్ వినలేదు: బుచ్చిబాబు



పెద్ది' సినిమాలోని తొలి పాట 'చికిరి చికిరి'కి రికార్డు స్థాయిలో వ్యూస్ దక్కాయి. అందులోని హుక్‌స్టెప్ సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. సోమవారం రాత్రి విడుదలైన రెండో పాట 'రై రై రారా' (Rai Rai Raa Raa) కూడా అదే జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే నెటిజన్లు ఈ సాంగ్‌కు సంబంధించిన రీల్స్‌తో సందడి చేస్తున్నారు. కేవలం తెలుగు లిరికల్ వీడియోకే యూట్యూబ్‌లో ఇప్పటి వరకూ 17+ మిలియన్ వ్యూస్ రావడం విశేషం. ఈ విజయం వెనుక దాగిన కష్టాన్ని చిత్ర దర్శకుడు బుచ్చిబాబు (Buchi Babu Sana) పంచుకున్నారు. ఈ పాట షూటింగ్ సమయానికి రామ్‌చరణ్ (Ram Charan)కు తీవ్ర జ్వరం ఉందని, దీంతో షూటింగ్ ఆపేద్దామని చెప్పినా ఆయన వినలేదని తెలిపారు. పాట బాగుందంటూ చిరంజీవి (Chiranjeevi) పెట్టిన పోస్టుకు బదులిస్తూ.. షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. 'ఆ రోజు ఇంకా గుర్తుంది సర్. ఈ బీజీఎం (పాటలోని నేపథ్య సంగీతం) షూటింగ్ చేస్తున్నప్పుడు చరణ్‌కు తీవ్ర జ్వరం. మేం షూటింగ్ ఆపేద్దామన్నా.. ఆయన 'లేదు చేద్దాం' అని అన్నారు. అంత జ్వరంలోనూ చిరునవ్వుతో, ఎంతో గ్రేస్‌తో డ్యాన్స్ చేశారు. ఆ డెడికేషన్ అన్నీ మీ నుంచి వచ్చినవే సర్'' అని బుచ్చిబాబు పేర్కొన్నారు.

**చరణ్ డ్యాన్స్ గర్వకారణం: చిరంజీవి**

'రై రై రారా' సాంగ్ స్క్రీన్‌పై ఓ ఫైర్‌లా ఉందంటూ చిరంజీవి పోస్టు పెట్టారు. అది ఎనర్జీ, ఎమోషన్‌లతో కూడిన అద్భుతమని కొనియాడారు. చరణ్ గ్రేస్, డ్యాన్స్‌లో వేగం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, గేయ రచయిత అనంత శ్రీరామ్, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, దర్శకుడు బుచ్చిబాబు, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, నిర్మాత వెంకట సతీశ్ కిలారులను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది.

### సంగీత్ వేడుకలో
## విజయ్-రష్మికల సందడి..



టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన తమ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను ఒక్కొక్కటిగా అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా తమ సంగీత్ వేడుకకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి వివాహం కుటుంబసభ్యులు, సన్నిహితుల మధ్య ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. పెళ్లికి రెండు రోజుల ముందు, అంటే ఫిబ్రవరి 24న ఇదే హోటల్‌లో సంగీత్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

సంగీత్ వేడుక కోసం విజయ్, రష్మిక ప్రత్యేకంగా డిజైన్ చేసిన దుస్తుల్లో మెరిసిపోయారు. ప్రముఖ డిజైనర్లు ఫల్గుణి షేన్ పీకాక్ ఇండియా రూపొందించిన అవుట్‌ఫిట్స్‌లో ఈ జంట రాజకుమారుడు, రాజకుమారిలా కనిపించారు. రష్మిక సిల్వర్ కలర్ లెహంగాలో మెరవగా, విజయ్ నల్లటి దుస్తులపై రాళ్లు పొదిగిన డిజైన్‌తో ఆకట్టుకున్నారు. ఇద్దరూ పొడవాటి కేప్ ధరించి తమ లుక్స్‌కు రాయల్ టచ్ ఇచ్చారు. పంచుకున్న ఫొటోలలో ఇరు కుటుంబాల మధ్య ఉన్న ప్రేమ, బంధం స్పష్టంగా కనిపిస్తున్నాయి. విజయ్ తల్లిదండ్రులు, సోదరుడు ఆనంద్, రష్మిక తల్లిదండ్రులు, చెల్లెలు షిమాన్ మందనతో కలిసి దిగిన ఫ్యామిలీ ఫొటో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ వేడుక గురించి రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ప్రేమ, ఆనందబాష్పాలు, నవ్వులు, సంగీతం, పాటలు, గ్లిట్టర్స్‌తో నిండిన రాత్రి అది. మేమిద్దరం ఒకరినొకరం సర్‌ప్రైజ్ చేసుకోవాలనుకున్నాం. మా కుటుంబసభ్యులు మమ్మల్ని సర్‌ప్రైజ్ చేయాలనుకున్నారు. వాళ్లంతా అంత స్వేచ్ఛగా, అద్భుతంగా డ్యాన్స్ చేయడం చూసి ఆశ్చర్యపోయాం. ఫల్గుణి షేన్ పీకాక్ డిజైన్ చేసిన డ్రెస్ చాలా బరువుగా ఉన్నా, రాత్రంతా అందులోనే ఉన్నాను. ఫిబ్రవరి 24, 2026.. ఆ రాత్రి విజయ్, నేను మా కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రేమ మధ్య ఒక్కటై డ్యాన్స్ చేశాం" అని రాసుకొచ్చారు.

విజయ్ దేవరకొండ కూడా ఈ వేడుకను గుర్తుచేసుకుంటూ... "కళ్లలో నీళ్లు తిరిగేంతగా నవ్వుకున్నాం. పాదాలు నొప్పి పెట్టేంత వరకు డ్యాన్స్ చేశాం. అందరి ప్రసంగాలు, సర్‌ప్రైజ్‌లతో భావోద్వేగాలను ఆపుకోలేక కళ్లు చెమ్మగిల్లాయి. అందమైన మనుషులతో నిండిన ఒక పెద్ద సంతోషకరమైన పార్టీ అది. తెల్లవారుజాము 4 గంటల వరకు అదే దుస్తుల్లో ఉన్నాను" అని పోస్ట్ చేశారు. ఈ పోస్టులు, ఫొటోలు చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### నేనే అందరినీ ఏడిపిస్తా..
## నాలో మరో కోణాన్ని చూస్తారు: లయ

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ఎంటర్‌టైనర్ అయినా కథలో ఓ ఆసక్తికర మలుపుతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని అంటున్నారు లయ. శివాజీతో కలిసి ఆమె నటించిన చిత్రమిది. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. ఈటీవీ విన్‌తో కలిసి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న (Sampradayini Suppini Suddapoosani Release date) సందర్భంగా లయ పంచుకున్న ఆసక్తికర విశేషాలివే..!

హీరోను డామినేట్ చేసే పాత్ర..

''శివాజీగారితో కలిసి నటించి 20ఏళ్లు అవుతోంది. ఈ సినిమా గురించి అడగగానే ఫ్యామిలీ డ్రామా అనుకున్నాను. కానీ, ఓ ఎంటర్‌టైనర్. అన్ని వయసుల వారికి నచ్చుతుంది. ఇందులో ఓ ఆసక్తికర ట్విస్ట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఇప్పటి వరకు నన్ను నేను ఇలాంటి పాత్రలో చూసుకోలేదు. మంగపతి లాంటి పవర్‌ఫుల్ పాత్ర చేసిన హీరోను డామినేట్ చేసే పాత్ర నాది. నేను, శివాజీ కలిసి నటించిన సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఓటీటీ నుంచి థియేటర్‌లో విడుదలవడం ఎంతో ఆనందంగా ఉంది''

అందరినీ ఏడిపిస్తా..

''సినిమా అంటే శివాజీకి ప్యాషన్. సినిమాను అన్ని రకాలుగా ప్రేమిస్తుంటారు. ఇక దర్శకుడు సుధీర్ శ్రీరామ్ స్టోరీ ఎంత బాగా రాసుకున్నాడో. అంత క్లారిటీగా తీర్చిదిద్దాడు. ఏ పాత్రకు ఎంత నటన కావాలో అంతా మా నుంచి రాబట్టాడు. మంచి ప్రతిభ గల దర్శకుడు. లయ అంటే ఎమోషనల్ పాత్రలే చేస్తుందనే గుర్తింపు ఉండేది. కానీ, ఈ సినిమాలో అందరినీ ఏడిపిస్తా. తన భర్త, ఫ్యామిలీ గురించి ఆలోచించే స్వార్థపరురాలి పాత్ర''

నాలో మరో కోణాన్ని చూస్తారు..

''అన్నిసార్లు ప్రధాన పాత్రలు వస్తాయనుకోలేం. కానీ కథ, నా పాత్ర నచ్చితే చిన్న పాత్రలైనా చేస్తాను. కథను మలుపు తిప్పే శక్తిమంతమైన క్యారెక్టర్స్ చేయాలని ఉంది. నేను చూడటానికి సాఫ్ట్‌గా ఉన్నా ఏదైనా చెప్పాలంటే బలంగా చెబుతా. 'వదల' అనే సినిమాలో జగపతిబాబుతో నటిస్తున్నాను. ఇందులో నాలో మరో కోణాన్ని చూస్తారు. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. డిఫరెంట్ జోనర్‌లో ప్రయత్నిస్తున్నాను. శ్రీకాంత్‌తో కూడా ఓ సినిమా చేస్తున్నాను. నాగేశ్వరరెడ్డి దర్శకుడు'' అని విశేషాలను లయ పంచుకున్నారు.



## ఎట్టకేలకు భారత్‌కు చేరుకున్న పీవీ సింధు




పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు (PV Sindhu) ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. ''సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమ్మిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా'' అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు. ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.

## మా హోంగ్రౌండ్ 'అహ్మదాబాద్'లో మళ్లీ ఆడతాం ..దక్షిణాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి

: టీ20 ప్రపంచ కప్ 2026లో ఇప్పటి వరకు అజేయంగా సెమీస్‌కు చేరుకున్న ఏకైక జట్టు దక్షిణాఫ్రికా. లీగ్, సూపర్ 8 స్టేజ్‌లో వరుస విజయాలను నమోదు చేసిన దక్షిణాఫ్రికా తొలి సెమీస్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. మార్చి 4న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనుంది. సఫారీ జట్టును ఇంతకుముందు వరకు చోకర్స్ (భారీ టోర్నీల్లో విఫలమయ్యే పెద్ద జట్టు)గా పిలుస్తుండేవారు. అయితే, తమపై ఉన్న ఆ ముద్రను గత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ గెలవడంతో చెరిపివేశామని దక్షిణాఫ్రికా ప్రధాన కోచ్ షుక్రి వెల్లడించారు. మెగా టోర్నీలో ఆడే సమయంలో ఒత్తిడి ఉండటం సహజం. అలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలి? ఆ ఒత్తిడిని ఎలా మరల్చాలి? అని ఆలోచిస్తాం. సెమీస్ మ్యాచ్ కావడంతో ఇంకాస్త ఒత్తిడి ఉన్నా.. దానిని స్వీకరించి విజయం సాధించడంపైనే దృష్టిపెడతాం. అందుకోసం గతానికి భిన్నంగా ఏమీ చేయం. ఇప్పటి వరకు ఎలా ఆడామో.. కివీస్‌తో మ్యాచ్‌లోనూ అదే దూకుడు కొనసాగిస్తాం'' అని షుక్రి తెలిపారు.

**మేం ఫేవరెట్‌గానే..**

''టీ20 ప్రపంచ కప్‌ను మేం టైటిల్ ఫేవరెట్‌గానే ప్రారంభించాం. ఇప్పటి వరకు అజేయంగా ఈ స్టేజ్‌కు వచ్చాం. కాబట్టి, మాపై పెద్దగా ఒత్తిడి ఉండదు. న్యూజిలాండ్ వంటి టాప్ టీమ్‌తో ఆడేటప్పుడు అలా భావించం. తప్పకుండా విజయం సాధించి మాకు అచ్చొచ్చిన మా సొంత మైదానం 'అహ్మదాబాద్'లో జరగబోయే ఫైనల్‌లో ఆడతామని అనుకుంటున్నా'' అని షుక్రి వెల్లడించారు. ఇప్పటి వరకు సఫారీ జట్టు ఎక్కువ మ్యాచ్‌లను అహ్మదాబాద్‌లో ఆడింది. టీమ్‌ఇండియాపై సూపర్ 8లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. అందుకే, 'అహ్మదాబాద్'ను హోం గ్రౌండ్‌గా దక్షిణాఫ్రికా

## అదే ఆట.. అదే పోజు.. మూడు ఇన్నింగ్స్‌లూ సూపర్


ఫస్ట్ బ్యాటర్ యువీ..


ఈసారి కింగ్ కోహ్లీ..


ఇప్పుడు సంజు..

**టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ 'క్వార్టర్ ఫైనల్'లో విండీస్‌ను చిత్తు చేయడంలో సంజు శాంసన్‌దే కీలక పాత్ర. అజేయంగా 97 పరుగులు చేసి టీమ్‌ను గెలిపించాడు. ఆఖర్లో బౌండరీ కొట్టాక సంజు చేసిన విజయనాదం చూస్తే.. మరో ఇద్దరు స్టార్లను గుర్తుకుతెచ్చింది. మరి ఆ ప్లేయర్లు ఎవరు? అప్పుడు ఎలా గెలిపించారో ఓ లుక్కేద్దాం...**

**ఫస్ట్ బ్యాటర్ యువీ..**

ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా 2011 వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తలపడింది. ఐసీసీ టోర్నీలంటే చెలరేగిపోవడం ఆసీస్‌కు అలవాటు. కానీ, యువరాజ్ సింగ్ ముందు మాత్రం ఆ జట్టు పప్పులు ఉడకలేదు. 261 పరుగుల లక్ష్య ఛేదనలో సచిన్ (53), గంభీర్ (50) హాఫ్ సెంచరీల దెబ్బకు అలవోకగా విజయం సాధిస్తుందని అంతా భావించారు. అనూహ్యంగా స్వల్ప వ్యవధిలో వికెట్లు చేజార్చుకొని ఇబ్బందుల్లో పడిన టీమ్‌ఇండియాను సురేశ్ రైనా (34*)తో కలిసి యువరాజ్ (57*) ఆదుకొన్నాడు. చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించాడు. బ్రెట్ లీ, షాన్ టైట్, మిచెల్ జాన్సన్ వంటి పేసర్లను తట్టుకొని పరుగులు రాబట్టిన యువీ.. మ్యాచ్ ముగిసిన తర్వాత సింహనాదమే చేశాడు. తొలుత బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బకొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**ఈసారి కింగ్ కోహ్లీ..**

ఛేజింగ్ కింగ్ అని విరాట్‌ను ఊరికనే అనరు. లక్ష్యం ఎంతైనా సరే.. అతడు బరిలోకి దిగాడంటే హాంఫట్ అయిపోవాల్సిందే. ఇప్పుడు విండీస్‌పై సంజు ఘనత సాధించాడు కానీ.. టీ20 ప్రపంచకప్‌ల్లో లక్ష్య ఛేదనకు దిగినప్పుడు అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా మొన్నటివరకూ విరాట్ కోహ్లీనే ఉన్నాడు. 2016లో ఆస్ట్రేలియా, 2021లో పాక్‌పై 82 పరుగులు చొప్పున చేసి అజేయంగా నిలిచాడు. 2016లోనూ భారత్ సెమీస్‌కు చేరుకోవాలంటే ఆసీస్ అనే అడ్డంకిని అధిగమించాల్సిన పరిస్థితి. అదికూడా ఈసారి ఆడినట్టే 'క్వార్టర్ ఫైనల్' లాంటిదే. 161 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ (82: 51 బంతుల్లో) అదరహో అనిపించాడు. ఏడు బంతుల్లో 4 పరుగులు కొట్టాల్సిన సమయంలో ధోనీ స్ట్రైకింగ్‌లో ఉన్నాడు. కానీ, సింగిల్ తీసే అవకాశం వచ్చినా వద్దని కోహ్లీని ధోనీ వారించాడు. విన్నింగ్ షాట్‌గా బౌండరీ కొట్టి విరాట్ కోహ్లీ సంతోషంతో మైదానంలో అలా ఉండిపోయాడు.

**ఇప్పుడు సంజు..**

ఓడితే ఇంటిముఖం పట్టాల్సిందే. అవతలి వైపు దూకుడుగా ఆడే విండీస్. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌పై భారత బౌలర్ల దెబ్బకు వెస్టిండీస్ 200లోపే పరుగులు చేయగలిగింది. అయితే, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌లో లేడు. వన్‌డౌన్ వచ్చిన ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌లో నిలకడలేదు. సూర్యకుమార్ కూడా త్వరగా పెవిలియన్‌కు చేరాడు. తిలక్ వర్మ కొన్ని మెరుపులు మెరిపించాడు. పాండ్య దూకుడు కొద్దిసేపే ఉంది. ఓ ఎండ్‌లో మాత్రం పాతుకుపోయిన ఓపెనర్ సంజు శాంసన్ (97*: 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివరివరకూ ఉండి జట్టును గెలిపించాడు.

## విరాట్ కోహ్లీ ఎప్పటికీ ఆర్సీబీ ఐకానిక్ హీరోనే: మో బోబాట్

టీమ్‌ఇండియా (Team India) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (Virat Kohli) ఎప్పటికీ ఆర్సీబీ (Royal Challengers Bengaluru)కి ఐకానిక్ హీరోగా ఉంటాడని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బోబాట్ అన్నాడు. ఆర్సీబీ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. 'విరాట్ కోహ్లీ కచ్చితంగా ఆర్సీబీకి ఐకానిక్ హీరోగా ఉంటాడు. అతడు మరో జట్టుకు వెళతాడని నేననుకోవడం లేదు. అతడి ట్రాక్ రికార్డ్ అత్యద్భుతం' అని మో బోబాట్ అన్నాడు. అలాగే బ్యాటింగ్‌లో విరాట్ నిలకడ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'కోహ్లీ.. 18 సంవత్సరాలుగా ఒకే జట్టులో ఉన్నాడు. ఐపీఎల్‌లో విరాట్ 9,000 పరుగులకు దగ్గరయ్యాడు. సగటున అతడు సీజన్‌కు 500 రన్స్ రాబడుతున్నాడు. అది అద్భుతం' అని బోబాట్ పేర్కొన్నాడు. అలాగే రాబోయే ఐపీఎల్ (IPL) సీజన్‌లో తమ మైండ్‌సెట్ ఎలా ఉండబోతోందో అతడు వివరించాడు. 'మేం డిఫెండింగ్ ఛాంపియన్స్ కాదు. మేం ఏమీ డిఫెండ్ చేసుకోవడం లేదు. మేం ప్రస్తుత ఛాంపియన్స్. డిఫెండింగ్ చేసుకునే మైండ్‌సెట్ మాకొద్దు. మాకు ఎటాకింగ్ అంటే ఇష్టం. మేం బ్యాక్ టూ బ్యాక్ విజయాల కోసం చూస్తున్నాం' అని బోబాట్ అన్నాడు.



## అభిషేక్ శర్మ.. మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి ..టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్



టీమ్‌ఇండియా (Team India) టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ (Abhishek Sharma) ప్రస్తుత పొట్టి ప్రపంచకప్‌లో ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఆరు మ్యాచుల్లో కేవలం 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో మూడు డకౌట్లు, కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితుల్లో టీమ్‌ఇండియా.. వెస్టిండీస్‌తో ఆడిన మ్యాచ్‌లోనూ అతడు విఫలమయ్యాడు. 11 బంతుల్లో 10 రన్స్ మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అభిషేక్ శర్మకు కీలకమైన సూచనలు చేశాడు. అతడి మైండ్‌సెట్ మార్చుకోవాలని, షాట్ సెలక్షన్‌పై దృష్టిపెట్టాలని సూచించాడు. 'మన వికెట్‌కు మనం విలువ ఇవ్వకుంటే.. అలాగే పేలవమైన షాట్లు ఆడతాం. అభిషేక్ ఇప్పటికే తక్కువ సమయంలో స్టార్ క్రికెటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఒకవేళ అతడు సూపర్‌స్టార్‌గా కీర్తి సొంతం చేసుకోవాలంటే మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి. జట్టును విజయపథంలో నడిపించాలి' అని మనోజ్ తివారీ అన్నాడు.

అభిషేక్ ఫీల్డింగ్ గురించి కూడా మనోజ్ తివారీ మాట్లాడాడు. 'టీమ్‌ఇండియాలో స్థానం కోసం చాలా పోటీ ఉంది. అభిషేక్ వారందరికంటే ముందు ఉండాల్సిందే. ఫీల్డింగ్‌లోనూ అతడు రెండు క్యాచ్‌లను వదిలేశాడు. అతడి మైండ్‌సెట్‌లో మార్పు రావాలి' అని అతడు అన్నాడు.

అభిషేక్ బ్యాటింగ్‌లో టెక్నికల్ లోపాలున్నాయని టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ (Irfan Pathan) అన్నాడు. 'అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత అదే రిథమ్ కొనసాగించి, పరుగులు చేస్తాడనుకున్నా. కానీ అతడు పేలవమైన షాట్ కొట్టి ఔటయ్యాడు. అతడి మోకాలు బాగా వంగింది. అలాగే అతడి బాడీ వెయిట్ వెనక్కి పడిపోతోంది. అతడు సరైన పొజిషన్‌లో షాట్ ఆడలేదు. ఫ్రంట్ ఫుట్ మీద మరింత బరువు మోపాల్సిఉంది. అలాచేస్తే అతడికి మంచిది. ఈ విషయం మీద అభిషేక్ మరింత దృష్టిసారించాలి' అని ఇర్ఫాన్ పఠాన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు.

## ఆ రెండు జట్ల మధ్య హోరాహోరీ పోరు తథ్యం ..గావస్కర్

భారత్, ఇంగ్లాండ్ మధ్య సెమీస్ పోరు హోరాహోరీగా జరగనుందని టీమ్‌ఇండియా (Team India) మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ (Sunil Gavaskar) అన్నాడు. అయితే భారత్‌కే కాస్త విజయవకాశాలెక్కువ అని అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ లైనప్, బుమ్రానే (Jasprit Bumrah) దానికి కారణమన్నాడు. 'ఇరు జట్లూ సమతూకంగా ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగా ఉన్నాయి. మిడిలార్డర్ కూడా బాగుంది. ఇంగ్లాండ్ జట్టులోని కొందరు ఆటగాళ్లకు ఐపీఎల్ (IPL) ఆడిన అనుభవముంది. వారికి భారత్‌లోని పరిస్థితులపై అవగాహన ఉంది. అందుకే ఈ పోరు హోరాహోరీగా సాగనుంది' అని విశ్లేషించాడు. అలాగే బుమ్రా నైపుణ్యం గురించి కూడా మాట్లాడాడు. పవర్‌ప్లేలో బుమ్రాతో బౌలింగ్ చేయించాలని సూచించాడు. 'బుమ్రా పవర్‌ప్లేలో కనీసం రెండు ఓవర్లైనా బౌలింగ్ వేయాలి. జోష్ బట్లర్, ఫిల్ సాల్ట్, హ్యారీ బ్రూక్ వికెట్లను మ్యాచ్ ప్రారంభంలో తీయగలిగితే ఇంగ్లాండ్ వెన్ను విరిచినట్లవుతుంది. కానీ బుమ్రాతో అయిదు ఓవర్ల తర్వాత బౌలింగ్ వేయిస్తే పెద్దగా ప్రయోజనముండదు. ఎందుకంటే అప్పటికే బ్యాటర్లు కొన్ని బంతులు ఎదుర్కొని, క్రీజులో సెటిల్ అయి ఉంటారు' అని పేర్కొన్నాడు. అలాగే తిలక్ వర్మ (Tilak Varma) బ్యాటింగ్ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'తిలక్ వర్మ తెలివైన క్రికెటర్. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయగలడు. వెస్టిండీస్ మ్యాచ్‌లో సరైన సమయంలో పరుగులు రాబట్టి, సంజు శాంసన్ మీద ఒత్తిడి తగ్గించాడు. నం.3, 5, 6.. ఇలా ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగలడు' అని అన్నాడు.

## భారత్‌లో చిక్కుకుపోయిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు



వెస్టిండీస్ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026 నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. అయితే వారు భారత్‌ను కాస్త ఆలస్యంగా వీడనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో అంతరాయమే దీనికి కారణం. ఆటగాళ్ల ప్రయాణ భద్రత కోసం తాము ఐసీసీ (ICC), సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది. గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇరాన్ ప్రతిదాడి వల్ల దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే.

'గల్ఫ్ ప్రాంతంలో సైనిక చర్య వల్ల ప్రయాణ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీంతో అనేక అంతర్జాతీయ విమాన మార్గాలు ప్రభావితమయ్యాయి. భద్రత కారణాల దృష్ట్యా విమాన సంస్థలు ముందుగా షెడ్యూలు చేసిన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది' అని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. వెస్టిండీస్‌తో పాటు, జింబాబ్వే జట్టు కూడా ఈ కారణంగానే భారత్‌లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జింబాబ్వే క్రికెట్ జట్టు దిల్లీలో ఉన్నట్లు తెలుస్తోంది. 'మా క్రికెట్ జట్టు దుబాయ్ ద్వారా స్వదేశానికి తిరిగి రావాల్సిఉంది. కానీ మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి కారణంగా ప్రయాణ ప్రణాళికలు ప్రభావితమయ్యాయి' అని జింబాబ్వే క్రికెట్ బోర్డ్ ఎక్స్ వేదికగా ఓ ప్రకటనలో తెలిపింది.